సంపుటి 1 సంచిక 2

వ్యవసాయ మాసపత్రిక

# రైతు రత్న

జులై 2013 రూ.15





గంపెడాశతో...!

జీవామృతంతో సాగుకు

## జీవం పోస్తున్న పాలేకర్

5లో


వ్యవసాయ పరపతి.... గణంకాల గారడి!

22లో






# పచ్చిగడ్డితోనే పాడి లాభసాటి



చొప్ప నరికే యంత్రం


**జి.నిర్మల, డి.బి.వి.రమణ, పి.కె.పంకజ్, డి.సుధీర్**

**శాస్త్రవేత్తలు, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ హైదరాబాద్**


రాష్ట్రంలో పశుసంపదకు అవసరమైన పచ్చిమేత కొరత తీవ్రంగా ఉంది. కేవలం ఎండుగడ్డి మీద ఆధారపడితే పాడి ఎప్పుడూ లాభసాటి కాదు. పచ్చిమేత మేపిన పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. పాల ఉత్పత్తి పెరుగుతుంది. పాడి పరిశ్రమ చేపట్టిన రైతులు తమకున్న భూమిలో ఎంతోకొంత పచ్చిమేత సాగు చేయాలి. గట్ల మీద మిశ్రమ పంటగా, పండ్ల తోటల్లో సాళ్ల మధ్య కూడా పశుగ్రాసాన్ని పండించవచ్చు. పచ్చి మేత కొరత తీరాలంటే కొన్ని మెళకువలు పాటించాలి..

**పశుగ్రాసాల ఎంపిక:** ఎన్నో రకాల పశుగ్రాసాలు సాగులో ఉన్నాయి. మన అవసరాల మేరకు వీటిలో ఎంపిక చేసుకోవాలి. వీటిని ముఖ్యంగా మూడు రకాలుగా విభజించవచ్చు.

**1. గడ్డి రకం:** నెపియర్, పారాగడ్డి, గినిగడ్డి.

**2. ధాన్యపు రకం:** మేత జొన్న, మొక్కజొన్న, స్వీట్ సుడాన్.

**3. కాయ జాతి రకం:** అలసందలు, టాసర్లు, స్టైలో, జనుము, పిల్లిపెసర.

**మిశ్రమ పంటగా:** అలసంద, పిల్లిపెసర వంటి పశుగ్రాసాలు జొన్న, వేరుసెనగ పంటలలో మిశ్రమ పంటలుగా సాగుచేసుకోవచ్చు. దీనివల్ల పశుగ్రాసాల కోసం ప్రత్యేకంగా భూమిని కేటాయించాల్సిన అవసరం ఉండదు. అంతేకాక మిశ్రమ పంటగా సాగు చేస్తే పశుగ్రాసం గుబురుగా పెరిగి అధిక దిగుబడి ఇస్తుంది. ప్రత్యేకంగా ఎరువులు వాడాల్సిన అవసరం లేదు. నీటి తడులు కూడా దీని కోసం విడిగా పెట్టాల్సిన పని లేదు. తక్కువ ఖర్చుతో పశుగ్రాసాన్ని ప్రధాన పంటతో పొందవచ్చు.

**నిల్వ చేసే పద్ధతులు:** పశుగ్రాసం పుష్కలంగా లభించే రోజుల్లో వృథా చేయకుండా నిల్వ చేసుకొని కొరత సమయంలో ఉపయోగించుకోవచ్చు. దీనికి రెండు పద్ధతులు ఉన్నాయి.

మొదటిది పశుగ్రాసాన్ని ఎండు మేతగా తయారు చేయడం. దీనికి పలుచని కాండం కలిగిన కాయజాతి పశుగ్రాసాలు అనుకూలమైనవి. పశుగ్రాసం బూజుపట్టకుండా, చెడిపోకుండా, పోషక పదార్థాలు ఎక్కువ నష్టపోకుండా తేమను 15% వరకు తగ్గించాలి. ఈ విధంగా తయారయ్యే నాణ్యమైన ఎండుమేతలో ఆకులు ఎక్కువగా ఉండి ఆకుపచ్చని రంగుతో మృదువుగా నోరూరించే విధంగా ఉంటాయి. వాసన కూడా బాగుంటుంది. కెరోటిన్ శాతం చాలావరకు నష్టపోకుండా ఉంటుంది. పూత దశలో పోషక పదార్థాలు అధిక మోతాదులో ఉంటాయి. ఈ తరుణంలో పైరును కోస్తే దిగుబడి ఎక్కువ ఉండటంతోపాటు పోషక విలువలు సమతుల్యంగా ఉంటాయి.

పచ్చి మేతను పాతర వేసుకోవడం (సైలేజీ) రెండో పద్ధతి. సైలేజీ కోసం వాడదగిన పశుగ్రాసాలు హైబ్రిడ్ నేపియర్, మొక్కజొన్న, జొన్న మొదలైనవి. మాగుడు గడ్డిని పాడిపశువులకు రోజుకు 20 కిలోల చొప్పున ఇవ్వవచ్చు. గుండ్రటి ఆకారంలో గాని, చతురస్రాకారంలో గాని గుంటను తవ్వుకోవచ్చు. ఇది వర్షపునీటి పారుదల కింద ఉండకుండా జాగ్రత్తపడాలి. పూతకొచ్చే దశ వరకు పెరగనిచ్చి కొయ్యాలి. తక్కువ తేమ శాతం ఉండేలా చూసుకొని చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించాలి. మేతను పొరలు పొరలుగా పేర్చుతూ పొరల మధ్య గాలి లేకుండా గట్టిగా తొక్కాలి. దాని పై భాగంలో పాలిథిన్ కవర్ కప్పాలి. ఇలా నిల్వ చేసిన గడ్డి రెండు మూడు సంవత్సరాల వరకు చెడిపోకుండా ఉంటుంది. సైలేజీ గుంత తెరచిన తరువాత నెలరోజులలో వాడుకోవాలి. పాలు పితకడానికి ముందు నాలుగు గంటల లోపల పశువుకు సైలేజీ గడ్డి తినిపించవచ్చు.

**పశుగ్రాసాన్ని ముక్కలుగా కత్తిరించుకోవాలి:** జొన్న, సజ్జ, హైబ్రీడ్ నేపియర్ వంటి పశుగ్రాసాలను చాలా మంది రైతులు కత్తిరించి మేపరు. దీనివల్ల పశువులు కేవలం ఆకులు, ఇతర మెత్తని భాగాలను మాత్రమే మేసి కాండపు భాగాన్ని వదిలి వేస్తాయి. దాదాపు 40% పశుగ్రాసం ఇలా వృథా అవుతోంది. పోషకాలు వృథా కాకుండా అంగుళం పొడవు ముక్కలుగా నరికి మేపుకోవాలి. కత్తితోగాని, చొప్ప నరికే యంత్రంతోగాని కత్తిరించుకోవచ్చు.

**వరిగడ్డిని పోషకవంతంగా చేసే విధానం:** రోజుకు ఒక్కో పశువుకు యూరియాతో మాగవేసిన గడ్డి ఆరు కేజీలు కావాల్సి వస్తుంది. ఒక బక్కెట నీటిలో ఒక కిలో యూరియా కలిపి ఆ ద్రావణాన్ని గడ్డి మోపులపై చల్లి వాముగా వేయాలి. గాలి చొరబడకుండా

గడ్డివామును అదిమి వరి తాడుతో బిగించాలి. ఇలా వాము వేసిన పది పదిహేను రోజుల తరువాత పశువులకు మేపవచ్చు. యూరియా నీటిలో ఊరవేసిన గడ్డిలో 5% వరకు మాంసకృత్తులు పెరుగుతాయి. 45-55% వరకు తేమ పెరగడం వల్ల పశువులు బాగా తింటాయి. దీనివల్ల పశువుల జీర్ణశక్తి కూడా పెరుగుతుంది.

**పంట వ్యర్థాలతో మేపు వనరులు:** మొక్కజొన్న కంకులు, పొద్దుతిరుగుడు మొక్కలు, పత్తి మొక్కలు, చింతగింజలు, వేరుసెనగ కాయల పొట్టు, చెరకు కాండముల నుంచి తీసిన ఆకులు, వరిపొట్టు, కోళ్ల రెట్ట, పశువుల పేడ కూడా పశువులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. కరవు సమయంలో తమకు అందుబాటులో ఉన్న వీటితోపాటు తవుడు వంటి పదార్థాలతో దాణా తయారు చేసుకోవచ్చు.

**పశుగ్రాసం చెట్లను విస్తారంగా పెంచాలి:** తరచూ కరవుకు గురయ్యే ప్రాంతాల రైతులు పశుగ్రాసం చెట్లను విస్తారంగా పెంచాలి. వర్షాకాలం ఆరంభంలో సెసేబీనియా, అవిశ, సుబాబుల్, దిరిసెన వంటి చెట్లను ఖాళీ ప్రదేశాల్లో పెంచుకోవాలి. వీటి కొమ్మలు విరిచి కరవు సమయంలో పశువులను మేపుకోవచ్చు. ఈ చెట్ల ఆకులు 10-20% వరకు మాంసకృత్తులు, 50% వరకు పిండి పదార్థాలు కలిగి ఉంటాయి.

**ఇతర సూచనలు:**

- ☐ మాగాణిలో జనుము పంటను పశుగ్రాసంగా విత్తుకోవాలి. జనుము కోసిన తరువాత వరిగడ్డితో కలిపి వాము వేసుకోవాలి. ఈ రెంటినీ కలిపి మేపుకోవాలి.
- ☐ పచ్చి మేత కొరత సమయంలో నిత్యం దాణా, లవణ మిశ్రమాన్ని ఇవ్వాలి.
- ☐ నీటి వసతి గల భూముల్లో వేసవిలో కోతకు వచ్చే జొన్న జాతి పశుగ్రాసాల్ని విత్తుకోవాలి.
- ☐ వర్షాధారంగా పండించే ధాన్యపు జాతి పశుగ్రాసాలైన మేత జొన్న, పప్పు జాతి పశుగ్రాసాలైన అలసంద, స్టైల్ వంటి వాటిని జూన్ నుంచి విత్తుకోవచ్చు.